# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

శనివారం, తెలంగాణ

04 ఏప్రిల్ 2026




## ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

**పాలేరు, ఏప్రిల్ 03(నినాదం):** నేలకొండపల్లి మండలం లోని వివిధ గ్రామాలలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలం లోని పలు చర్చిలలో తెల్లవారు జామున నుంచే ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు కు సంబంధించిన బోధనలు చేశారు. మండల కేంద్రంలో శిలువ యాత్ర ను నిర్వహించారు. క్రీస్తు ను స్మరించుకుంటూ భక్తి పాటలతో మండల కేంద్రంలోని పలు వీధులలో ప్రదర్శన నిర్వహించారు. శిలువ ను మోసేందుకు భక్తులు పోటీ పడ్డారు. మండలం లోని చెరువుమాధారం లో బహిరంగ శిలువ మార్గం ను నిర్వహించారు. మండలం లో గుడ్ ఫ్రైడ్ ను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు చర్చి ఫాదర్స్, పాస్టర్స్, తదితరులు పాల్గొన్నారు.

## సిలువపై యేసు త్యాగం.. మానవత్వాన్ని మేల్కొల్పిన మహా సందేశం

### భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా సాగిన గుడ్ ఫ్రైడే సిలువ యాత్ర



**పాలేరు, ఏప్రిల్ 03(నినాదం):** గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం నేలకొండపల్లి పట్టణంలోని ప్రధాన పురవీధులలో భక్తి పరవశంతో మార్మోగాయి. యేసుక్రీస్తు శిలువ వేయబడిన దుఃఖ ఘట్టాన్ని స్మరించుకుంటూ క్రైస్తవ విశ్వాసులు ఉపవాసాన్ని ఆచరిస్తూ అత్యంత భక్తి శ్రద్ధలతో సిలువ యాత్ర నిర్వహించారు. ఉదయం 9.30 నిమిషములకు పాత బస్ స్టాండ్ వద్ద గల రోమన్ క్యాతళిక్ చర్చి నుండి ప్రారంభమైన ఈ కార్యక్రమం, వీధి వీధి తిరుగుతూ సాగిన సిలువ యాత్రతో మరింత ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. యాత్రలో పాల్గొన్న క్రైస్తవుల చేతుల్లో సిలువలను మోసుకుంటూ, యేసుక్రీస్తు అనుభవించిన బాధలను స్మరించుకుంటూ ప్రార్థనలు చేశారు. ప్రతి దశలో ప్రభూ, మమ్ము క్షమించు,అంటూ వినిపించిన ప్రార్థనలతో వాతావరణం భావోద్వేగభరితంగా మారింది. ఈ సిలువ యాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తమ భక్తిని చాటుకున్నారు.సిలువ యాత్ర సాగిన మార్గమంతా స్థానికులు సిలువకు నీళ్లు ఆరబోస్తూ తమ భక్తి శ్రద్దలను చాటుకున్నారు.


**క్రీస్తు నేర్పిన ప్రేమ,క్షమ, సేవాభావం అందరు కలిగివుండాలి,ఫాదర్ స్మిలెన్ మారియో**

యేసు క్రీస్తు మానవాళి పాప విమోచన కోసం తన ప్రాణాలను సిలువపై అర్పించాడని ఫాదర్ స్మిలెన్ మారియో విశ్వాసులకు సందేశాన్ని అందించాడు.

క్రీస్తు అనుభవించిన బాధలు, అవమానాలు అన్నీ ప్రేమతో సహించి చివరి శ్వాసవరకు క్షమాభావాన్ని చూపించాడని అలాంటి క్షమాబావాన్ని ప్రతి ఒక్కరు కలిగి జీవించాలని బోధించారు. ఒక పక్క తనను చంపివేస్తున్నారని తెలిసి కూడా వారిని క్షమించుము తండ్రి అనే ఆయన సిలువపై పలికిన మాటలు అపారమైన దయకు నిదర్శనమని బావోద్వేగబరిత ప్రసంగం చేశారు. సిలువపై చేసిన ఈ త్యాగం మానవత్వానికి ప్రేమ, క్షమ, సేవ అనే మహత్తర విలువలను నేర్పించిందని వెల్లడించారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో మహా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ జోసెఫ్, బ్రదర్ మరియకుమార్, ఉపదేశకులు సూరేపల్లి జ్ఞానరత్నం, పుష్ప, థామస్, ప్రసాద్, పుల్లారావు, నాగేశ్వరావు, బాలరాజు, మాజీ వార్డు సభ్యులు పగిడికత్తుల రాంబాబు, ఎస్సి సెల్ జిల్లా కన్వీనర్ జంగం లక్ష్మీ నారాయణ, మాల మహానాడు నాయకులు జంగం ప్రసాద్, యూనిటీ ఆఫ్ మాల జిల్లా కార్యదర్శి అవుట మధు, విచారణ సంఘ పెద్ద సిద్దెల వెంకటరత్నం, లక్ష్మి, ప్రసాద్, యువతి యువకులు విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కాంట్రాక్టర్ అత్యుత్సాహంతో- క్రీడా ప్రాంగణం ధ్వంసం

### బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి



**పాలేరు ఏప్రిల్ 03(నినాదం)**

కూసుమంచి మండల కేంద్రంలో ప్రజలకు ముఖ్యంగా యువకులకు మరియు విద్యార్థిని విద్యార్థులు కి ఉపయోగపడే క్రీడా ప్రాంగణం లేకుండా పోవడం ఆవేదన కలిగిస్తుంది. గత ప్రభుత్వం కాలంలో ప్రతి గ్రామంలో యువకులు, విద్యార్థిని విద్యార్థులు క్రీడల్లో గ్రామ స్థాయి నుండే రాణించాలని కేంద్ర ప్రభుత్వ నిధులతో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడం జరిగినది. లక్షల రూపాయల వ్యయం తో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం నేడు కూసుమంచి మండల కేంద్రంలో అందుబాటులో లేకుండా పోయింది. ముఖ్యంగా ఈ వేసవి కాలంలో విద్యార్థిని విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే క్రీడా ప్రాంగణం లేకుండా పోవడంతో వారు నిట్టూరుస్తున్నారు. కేవలము ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం పేరుతో క్రీడా ప్రాంగణం ను సంబధిత కాంట్రాక్టర్ మరియు అధికారులు నిర్లక్ష్యం, అలసత్వం తో మట్టి దెబ్బలతో నింపి యువకుల ఆశలపై నీళ్లు చల్లారు. ఇప్పటికీ ఐన స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తక్షణం స్పందించి సంబధిత కాంట్రాక్టర్ మరియు అధికారులు పైన చర్యలు తీసుకోవాలని అదేవిదంగా క్రీడా ప్రాంగణం త్వరితగతిన పూర్తి చేసి, విద్యార్థిని విద్యార్థులకు అందుబాటులోకి తేవాల్సిందిగా కోరుచున్నాము.

**నత్తనడకన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం పనులు.**

గత ఏడాది నుండి కూసుమంచి మండల కేంద్రంలో కళాశాల భవన నిర్మాణం పనులు నాసిరకంగా నత్త నడక నడుస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి జూన్ ఒకటవ తేదీన జూనియర్ కళాశాల కూసుమంచి మండల కేంద్రంలో విద్యార్ధిని విద్యార్థులకు అందుబాటులోకి రావాల్సి ఉండగా, కాంట్రాక్టర్ తీరుతో మరొక సంవత్సరం విద్యార్థులకు కష్టాలు తప్పేలా లేవు, విద్యాభ్యాసనం కొరకు సుదూరాం ప్రయాణం చేయడం ముఖ్యంగా విద్యార్థిని ల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. మండల ప్రజల పోరాటం ముఖ్యంగా మండల యువత పోరాటంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఏర్పాటు చేస్తున్న కళాశాల భవన నిర్మాణం నాసిరకంగా జరగడం ఆందోళన పరుస్తోంది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తక్షణం స్పందించి సంబధిత అధికారుల చేత అనునిత్యం పర్యవేక్షణ జరిపించాలనని ప్రజలు కోరుకుంటున్నారు.

# తెలంగాణ ఉద్యమజ్వాల దొడ్డి కొమురయ్య

### బిజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్



**పాలేరు, ఏప్రిల్ 03(నినాదం):** భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో తెలంగాణ తొలి ఉద్యమకారుడు దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనమైన నివాళులు అర్పించడం జరిగింది ఈ సందర్భంగా పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ ఆధిపత్యానికి, అహంకారానికి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా జరిగిన,తెలంగాణ సాయుధ పోరాటం' మిగతా ప్రపంచ పోరాటాల కంటే భిన్నమైన. చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది.ఈ స్ఫూర్తే నియంత పోకడలను నిలువరించడానికి అవసరమైన భావజాలాన్ని అందించింది.అన్యాయం శృతి మించితే ఆయుధాలను ఎత్తించి, ధిక్కార స్వరాలై నిలదీసేలా చేసింది.నిజాం నిరంకుశ పాలనకు, దొరల పెత్తందారీ విధానానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంతో ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకోవాలనుకున్న మిలిటరీ పాలనకు ఎదురొడ్డి 4000 మంది కార్యకర్తలు అమరులైనారని అన్నారు,ఆ కోవలో అమరుడై,తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి అమరత్వాన్ని ఇచ్చి స్ఫూర్తినిచ్చినవారే దొడ్డి కొమురయ్య అని అన్నారు,భూ సమస్యలపై దేశ వ్యాప్తంగా చర్చ జరిగే విధంగా చేసింది. తెలంగాణ ప్రజలను చైతన్య పరిచింది. బాంచెన్ దొరా నీ కాళ్లు మొక్కుతా అన్న బడుగు వారి చేత ఆయుధాలు పట్టించిం, అప్పటి నల్లగొండ జిల్లా జనగామ తాలూకాలోని విస్నూరు గ్రామంలో రాక్షతత్వానికి నిలువెత్తు నిదర్శనం అయినా విస్నూర్ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి, అతని కొడుకు బాబుదొర వీరి ఆగడాలు అంతాఇంతా కాదనీ,60 గ్రామాలకు అధిపతి ఈ నరరూప రాక్షసుడు నిజాంకు తొత్తులుగా ఉన్న దొరలు, పటేళ్లు, పట్వారీలు గ్రామాల్లో ప్రజలపై చేయని అఘాయిత్యం లేదనీ విస్నూరు దగ్గరలో ఉన్న కడవెండి గ్రామాల రామచంద్రారెడ్డి తల్లి జానమ్మ జాగీర్దార్ కడవెండి ఊరులో దొరసాని చేసిన ఆగడాలు తక్కువ ఏమి కాదనీ చరిత్ర చెపుతుందని 20 ఎకరాలు కూడా లేని జానమ్మ దొరసాని అనతికాలంలో ఊరును అంత తన గుప్పిట్లో పెట్టుకొని,జానమ్మ దొరసాని ప్రజల చేత దొర అని పిలిపించుకునేది. ఈ అణచివేత నుండి 1944 ఆంధ్ర మహాసభ ఏర్పాటు, తెలంగాణ ప్రాంతం అంతా ఆంధ్ర మహాసభ నాయకత్వంలో సంఘాన్ని ఏర్పరుచుకొని సంఘం అండతో గ్రామాల్లో ప్రజలు వెట్టిచాకిరి రద్దు కోసం ఉద్యమబాట పట్టారనీ, పన్నులు కట్టేది లేదని తిరుగుబాటు చేశారనీ,ఇది చూసిన దొరలు ఉద్యమాన్ని అణచడం కోసం అనేక ప్రయత్నాలు చేసే వారు.దొడ్డి కొమురయ్య, అన్న దొడ్డి మల్లయ్య గ్రామంలో గొల్ల, కురుమల నాయకుడు. దొరసాని వెట్టికి గొర్రెలను ఇవ్వద్దని గొర్ల కాపర్లను చైతన్యపరిచాడు. దొడ్డి మల్లయ్యతో పాటు అదే గ్రామానికి చెందిన మంగలి కొండయ్య, నరసయ్య ఎర్రం రెడ్డి మోహన్ రెడ్డి, నల్ల నరసింహులు అప్పుడున్న సంఘంలో చేరి గ్రామ నాయకులు అయినారు. ఇది మింగుడుపడని జానమ్మ దొరసాని వీళ్లను హతమార్చాలని పన్నాగం పన్నింది. దొరసాని ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజలు అంతా నిరసన ప్రదర్శన చేయాలని సంఘం నిర్ణయించింది. సాయుధ పోరాట వేగుచుక్క సంఘం పిలుపు అందుకొని కడవెండి గ్రామంలో ప్రజలు అంతా వీధుల గుండా ప్రదర్శన చేశారు. అప్పటికి దొరసానికి అండగా వచ్చిన విస్నూరు రామచంద్రారెడ్డి రౌడీలు కోడూరు దొర నరసింహారెడ్డి నాయకత్వం గడి నుండి ఎలాంటి హెచ్చరికలు లేకుండా కాల్పులు జరిపారు. కడుపులోకి తూట దిగడంతో కొమురయ్య అక్కడికక్కడే నేలకొరిగాడు.కొమురయ్య అన్న మల్లయ్య కాలుకు తూట దూసుకుపోయింది. లక్ష్మీనరసయ్య కొండయ్యలకు గాయాలయ్యాయి. కొమురయ్య మరణం చుట్టు పక్కల గ్రామాల ప్రజల్లో ఆగ్రహాన్ని రగిల్చింది.వేలాది మంది ప్రజలు ఎక్కడికక్కడ సంఘం అండతో గ్రామాలలో దొర గూండాలను తరిమికొట్టారు. కొమురయ్య బలి దానం తెలంగాణ సాయుధ పోరాటానికి పురుడు పోసింది. సంఘం పిలుపుతో ప్రజలు సాయుధ మార్గం పట్టారు. కొన్ని ప్రాంతాలకు దేశ్‌ముఖ్‌లు ఉంటూ ప్రజలను రాచి రంపాన పెట్టినా దొరలను, వారి ఆధిపత్యాన్ని కూలదోశారనీ అన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు మండల నాయకులు పుట్టా సత్యనారాయణ,సయ్యద్ మోహినుద్దీన్, కళ్యాణం నాగేశ్వరరావు, బానోతు శ్రీనివాసరావు, మూడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.


## ఆగని అక్రమ వెంచర్లు.. పట్టించుకోని అధికారులు



**పాలేరు ఏప్రిల్ 03(నినాదం):** రియల్ ఎస్టేట్ వ్యాపారం ఇప్పుడు పల్లెలకు విస్తరిస్తుంది. మండల కేంద్రాల చుట్టూ ఖాళీ జాగా కనిపిస్తే చాలు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్కడ పాగా వేసి ఫ్లాట్లుగా మార్చి అమ్మేస్తున్నారు. నేలకొండపల్లి మండలంలోని గ్రామంలో అక్రమ పాశీ ల్యాండ్ వెంచర్ల దందా జోరుగా సాగుతుంది. నేలకొండపల్లి మండల కేంద్రంలో రియల్ ఎస్టేట్ కొత్త పద్ధతిలో వెంచర్లు ఫామ్ లాండ్లు ఏర్పాటు చేస్తున్నారు. వెంచర్లో హద్దురాళ్ళు బదులు మొక్కలు నాటి సాగు భూమి గా చూపుతూ ప్లాట్లు విక్రయిస్తున్నారు. నిబంధన మేరకు ల్యాండ్ కన్వర్షన్ కోసం ప్రభుత్వానికి కట్టవలసిన ఫీజును ఎగ్గొట్టేందుకు నాయా దందాకు పాల్పడుతున్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదు. పంచాయతీ పరిధిలో వెంచర్లులో 10% భూమిని పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేసి 33 ఫీట్ల రోడ్లను ఏర్పాటు చేయాలి. కానీ రియల్ ఎస్టేట్లు అధికారులు ప్రభుత్వానికి సమర్పించవలసిన భూమిని. ప్రభుత్వ అధికారులే అవినీతి పాల్పడుతున్నట్టు పరిస్థితి నిబంధన ప్రకారం, నేలకొండపల్లి ప్రాంతాల్లో లేఅవుట్ చేయాలంటే హెచ్ఎండిఏ లేదంటే మున్సిపల్ కార్పొరేషన్ గ్రామపంచాయతీ నుంచి అనుమతి తీసుకోవలసి ఉంటుంది. దీని ప్రకారం ప్రభుత్వానికి ఫీజు రూపంలో లక్షల్లో ఆదాయం వస్తుండగా రోడ్ల కోసం 30% శాతం పార్కులు ఇతర అవసరాల కోసం మరో 10% శాతం భూమిని వదిలి పెట్టాల్సి ఉంటుంది. ఇవన్నీ చేయకుండా ఉండేందుకు పాత లేఅవుట్ అంటూ చెబుతూ 25 ఫీట్లతోనే రోడ్లు వేసి పార్కు గజం స్థలం కూడా వదలకుండా ప్లాట్ ను చేసి విక్రయిస్తున్నారు. అయితే చిన్న లేవట్లన్నీ ఇండ్లకు సమీపంలోనే ఉండటంతో నేరుగా ఇంటి నిర్మాణం చేపట్టి విక్రయాలు బిల్డర్లకు వాటిని విక్రయిస్తున్నారు. మున్సిపల్ అధికారుల అవినీతికి తోడు విద్యుత్ అధికారులు అనుమతి లేని వెంచర్లో పెద్ద మొత్తంలో విద్యుత్ స్తంభాలు ట్రాన్స్ఫార్మర్ ను సైతం ఏర్పాటు చేస్తుండటంతో నిర్మాణాలు శరవేగంగా చేపడుతున్నారు. ప్రభుత్వానికి ఆదాయాన్ని రాబట్టాల్సిన అధికారులే అక్రమ నిర్మాణాలను ప్రోత్రాయిస్తు తమ జేబులు నింపుకుంటున్నారని ఆరోపణలు,శివారు గ్రామపంచాయతీలలో వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ నిబంధన ప్రకారం లేఅవుట్లను ఏర్పాటు చేసి ప్రణాళికాబద్ధకమైన పట్టణీకరణ జరిగేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## ఇన్సూరెన్స్ పేరుతో మోసాల సంచలనం...

- రేలకుంటలో అనుమానాస్పద మరణాలపై భయం



**నల్లబెల్లి, ఏప్రిల్ 3 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని రేలకుంట గ్రామంలో ఇన్సూరెన్స్ పాలసీల పేరుతో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యవహారం సంచలనంగా మారింది. అమాయక కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని ప్రాణాలపై వ్యాపారం జరుగుతోందన్న ప్రచారం గ్రామంలో కలకలం రేపుతోంది. అనుమానాస్పద మరణాలు, భారీ మొత్తాల ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికుల కథనం ప్రకారం, కొందరు వ్యక్తులు ముందుగా గ్రామస్తులను సంప్రదించి తక్కువ మొత్తంలో ఇన్సూరెన్స్ పాలసీలు తీసేలా ప్రలోభపెడుతున్నారు. సుమారు రూ.2 లక్షల పాలసీపై మరణం సంభవిస్తే రూ.20 లక్షలకుపైగా లాభం వస్తుందని, నమ్మబలుకుతున్నట్లు సమాచారం. ఈ ఆశతో కొంతమంది కుటుంబాలు ఈ ఒప్పందాలకు,ఒప్పుకుంటున్నట్లు గ్రామంలో చర్చలు సాగుతున్నాయి.పాలసీ గడువు పూర్తయ్యేలోపు మరణం జరగకపోతే, కొత్త పాలసీలు తీసుకునేలా మళ్లీ ఒత్తిడి తెస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం వెనుక ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్ పనిచేస్తోందన్న,అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా, గ్రామంలో వినిపిస్తున్న మరింత భయంకర ఆరోపణలు ప్రజల్లో కలవరాన్ని పెంచుతున్నాయి. కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా హత్యలకు పాల్పడి, ఆ తర్వాత ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు పొందుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. వచ్చిన డబ్బును మధ్యవర్తులు, కుటుంబ సభ్యులు, ప్రభావశీలులు పంచుకుంటున్నారన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాలపై గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి, పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి నిజానిజాలు వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు. అమాయకుల ప్రాణాలతో ఆటలాడే ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ప్రస్తుతం ఈ వ్యవహారం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, అధికారుల స్పందనపై గ్రామ ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ

- బీఆర్ఎస్ గ్రామ పార్టీ ఆధ్వర్యంలో సహాయక చర్యలు



**నల్లబెల్లి, ఏప్రిల్ 3 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మేడపల్లి గ్రామానికి చెందిన పైతరి చేరాలు ఇటీవల పరమపదించడంతో, వారి కుటుంబానికి గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు కలిసి సహాయం అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ గ్రామ పార్టీ ఆధ్వర్యంలో అవసరమైన సహాయక చర్యలు చేపట్టారు.నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు, గ్రామ సర్పంచ్ అర్రెమ్ సాంబయ్య 25 కిలోల బియ్యం, మాజీ సర్పంచ్ లావుడియా తిరుపతి 50 కిలోల బియ్యం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సహాయం ద్వారా కుటుంబానికి కొంతమేర ఉపశమనం కలిగించాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆవుల రాధిక యాకయ్య , గ్రామ పార్టీ అధ్యక్షుడు నడిగోట్టి వెంకన్న ఆదర్శ యువజన సంఘం అధ్యక్షుడు ఆవునూరి మురళి మాజీ టిసి తాళ్లపల్లి సుదర్శన్ పాల్గొన్నారు.సంధినేని యాదగిరి రావు ఎర్రోజు బిక్షపతి కొలిపాక రంజిత్ , అర్రెమ్ రాజేష్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ఇలాంటి సందర్భాల్లో అందరూ కలిసి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

## మేడ్చల్ జిల్లా డిసిసి ఉపాధ్యక్షుడిగా కూన శ్రీనివాస్ గౌడ్

- శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కార్యకర్తలు



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 3 (నినాదం):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కూన శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు బస్తీల నుండి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు షాపూర్ నగర్ లోని వారి నివాసానికి వచ్చి శ్రీనివాస్ గౌడ్ కు శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించిన పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, పటిష్టతకు కృషి చేస్తూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రుద్రగూడెంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

### అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం

### చిట్యాల తిరుపతి రెడ్డి



**నల్లబెల్లి, ఏప్రిల్ 3 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రుద్రగూడెం, గ్రామీణ పేదల గృహ సమస్యలనుపరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి కుటుంబానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి తెలిపారు.రుద్రగూడెం గ్రామానికి చెందిన ఈర్ల స్వరూప ఇందిరమ్మ ఇల్లు పూర్తికావడంతో శుక్రవారం గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తిరుపతి రెడ్డి, కొత్త ఇంటిని సందర్శించి గృహ యజమానులను అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గ్రామాల్లో నివాస సదుపాయాలు లేని పేద కుటుంబాలకు శాశ్వత గృహాలు కల్పించడం లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామంలో ఇంకా ఇల్లు అవసరమున్న అర్హుల వివరాలు సేకరించి, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, దశల వారీగా ఇళ్ల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు.గ్రామాభివృద్ధి కోసం స్థానిక నాయకులు, ప్రజలు కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మామిళ్ల రాజిరెడ్డి, రఘుసాల హనుమంతు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వక్కల అయ్యప్ప, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గాదె కరుణాకర్, లక్డే శివాజీ, ఎలకపల్లి చింటూ, ఈర్ల అనిల్, నానా బోయిన రజిత, వార్డు సభ్యులు భయ్యా రజిత, పిండి రాజు, అజ్మీర రాజు తదితర కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం బారిన పంచాయతీ భవనం

### శనిగరం ప్రజల్లో ఉగ్ర ఆవేదన



**నల్లబెల్లి, ఏప్రిల్ 3 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం ప్రజా నిధులతో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన గ్రామపంచాయతీ భవనం నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థకు చేరుకోవడం మండలం లో శనిగరం గ్రామంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రజలకు సేవలు అందించాల్సిన ఈ భవనం ప్రస్తుతం పశువుల సంచార కేంద్రంగా, చెత్త పేరుకుపోయే స్థలంగా మారడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. గ్రామస్తుల వివరాల ప్రకారం, భవన నిర్మాణం పూర్తికాకముందే పనులు నిలిచిపోవడంతో అది అసంపూర్తిగావదిలేయబడింది. అనంతరం ఎవరూ పట్టించుకోకపోవడంతో భవనం చుట్టూ చెత్త పేరుకుపోవడం, లోపల పశువులు తిరగడం సాధారణమైందని తెలిపారు. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు కూడా జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలుమార్లు ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రయోజనాల కోసం నిర్మించిన ఈ భవనాన్ని కొందరు వ్యక్తులు వ్యక్తిగత అవసరాలకువినియోగించుకోవడం ఆగ్రహానికిదారితీస్తోంది. పంచాయతీ కార్యాలయం సక్రమంగా, పనిచేయకపోవడంతో గ్రామంలో అభివృద్ధి పనులుస్తంభించిపోయాయని, ప్రభుత్వ పథకాల అమలులో అంతరాయం కలుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం వెచ్చించిన నిధులు వృథా అవుతుండటంపై తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్తుల డిమాండ్ స్పష్టంగా ఉంది---అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనాన్ని తక్షణమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, భవనాన్ని రక్షించే చర్యలు వెంటనే చేపట్టాలని, అనధికార వినియోగాన్ని అరికట్టాలని కోరుతున్నారు.ప్రజల డబ్బుతో నిర్మించిన భవనం ఇలా పాడైపోవడం బాధాకరం... వెంటనే చర్యలు తీసుకోండి అంటూ శనిగరం గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.